www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 2 డిసెంబర్ 2023

5

పశ్చిమ గోదావరి



బాల్య వివాహాలపై కఠినంగా వ్యవహరించాలి

కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

బాల్య వివాహాలను నిరోధించడంలో సంబంధిత అధికారులు కఠినంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులతో సమావేశమై బాల్య వివాహాలు, పోషకాహార లోపం కలిగిన పిల్లలు, వైఎస్ఆర్ సంపూర్ణ కిట్స్, ప్రీ స్కూల్ పిల్లల హాజరు, తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. బాల్య వివాహం చేసుకుంటే పోక్సో యాక్ట్ కింద కేసు పెట్టడంతో పాటు, సంబంధిత ఫొటోల ఆధారంగా బైండోవర్ కేసులు పెట్టాలని ఆదేశించారు. బాల్య వివాహాలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదన్నారు. జిల్లాలో ఒక్క కేసు నమోదైనా సంబంధిత అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కానాల సంగీత్ మాధుర్, స్త్రీ, శిశుసంక్షేమ శాఖ పిడి బి.సుజాత రాణి, సిడిపిఒలు పాల్గొన్నారు.



ఇసుక లేక.. ఇల్లు గడవక..!

పనుల్లేక భవన నిర్మాణ కార్మికుల పస్తులు
మూడు నెలలుగా ఇసుక కొరతతో ఇంటి దగ్గరే
36 రకాల నిర్మాణ కార్మికులపై తీవ్ర ప్రభావం
రెండు జిల్లాల్లోనూ మూడు లక్షల కుటుంబాలకుపైగా అవస్థలు
ఇంటి అద్దెలు కట్టలేక నరకయాతన

ఇసుక కొరతతో లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికుల బతుకులు దుర్భరంగా మారాయి. ఇల్లు గడవక పస్తులతో రోజులు గడుపుతున్న దుస్థితి నెలకొంది. మూడు నెలలుగా నరకయాతన అనుభవిస్తున్నా ప్రభుత్వానికి పట్టడం లేదు. ఇంటి అద్దెలు కట్టలేక, పిల్లలకు స్కూల్ ఫీజులు చెల్లించలేక నలిగిపోతున్నారు. ఇసుకపై పాలకులు వ్యవహరిస్తున్న తీరుపై సర్వత్రా ఆగ్రహ జ్వాలలు వ్యక్తమవుతున్నాయి. సమస్య ఎప్పటికీ పరిష్కారమవుతుందో తెలీక రోజులు వెళ్లదీస్తున్న పరిస్థితి నెలకొంది.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు మూడు లక్షల మందికిపైగా భవన నిర్మాణ కార్మికులు ఉన్నారు. నిర్మాణ రంగంలో దాదాపు 35 రకాల పనులు చేసేవారున్నారు. బోర్డు తీసేవారు, రాడ్ బెండింగ్, తాపీ పని, సెంట్రింగ్, ప్లంబింగ్, కార్పెంటర్, ఎలక్ట్రీషియన్స్, మార్బుల్స్ అతికేవారు, ఇటుక బట్టీల్లో పని చేసేవారు, కాంక్రీట్ మిల్లర్లు, ఇలా భవన నిర్మాణ కార్మికులు ఇలా 36 రకాల పనులు చేసే వారుంటారు. వీరంతా రోజువారీ పనులు చేసి కుటుంబాలను నెట్టుకొస్తుంటారు. తాపీ మేస్త్రీకి రూ.900, పనిచేసే కార్మికులకు రూ.600 కూలి ఉంటుంది. నెలంతా పని చేస్తేనే వీరికి ఇల్లు గడుస్తోంది. ఇసుక సరఫరాను ప్రభుత్వం నిలిపివేయడంతో గడిచిన మూడు నెలలుగా నిర్మాణ రంగం పూర్తిగా నిలిచిపోయింది. దీంతో పనుల్లేక కార్మికులు రోడ్డున పడిన పరిస్థితి ఉంది. ఆదాయం లేకపోవడంతో ఇల్లు గడవడమే కష్టంగా మారింది. అద్దె ఇంట్లో ఉంటున్న కుటుంబాలు అద్దె చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. బ్లాక్ మార్కెట్లో ఇసుక విక్రయాలు కొనసాగుతున్నా ధరలు చూస్తే గుండె గుబేలుమంటుంది. మూడు నెలల క్రితం లారీ ఇసుక రూ.18 వేల నుంచి రూ.20 వేల వరకూ ఉండేది. ఇప్పుడు రూ.30 వేల నుంచి రూ.32 వేల వరకూ ధర పలుకుతోంది. మొన్నటి వరకూ టన్ను ఇసుక రూ.750 ఉండగా ప్రస్తుతం రూ.1400 వరకూ పలుకుతోంది. ట్రాక్టర్ ఇసుక రూ.1200 ఉండేది కాస్తా రూ.ఆరు వేలకు చేరింది. బ్లాక్మార్కెట్లో ఇసుక కొనుగోలు చేయాలంటే చుక్కలు కన్పిస్తున్నాయి. దీంతో నిర్మాణ రంగం పనులు పూర్తిగా నిలిచిపోయాయి. వైసిపి ప్రభుత్వం వచ్చిన కొత్తలో ఉచిత ఇసుక పాలసీని రద్దు చేసి కొత్త పాలసీ ప్రకటించడంలోనూ జాప్యం చేయడంతో భవన నిర్మాణ రంగంలో పని చేసే కార్మికులు నెలలు తరబడి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మళ్లీ ఇప్పుడు అదే పరిస్థితి నెలకొంది. ఇంత పెద్దఎత్తున ఉపాధి పొందే రంగాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భవన నిర్మాణ కార్మికుల పట్ల ప్రభుత్వం అత్యంత ఘోరంగా వ్యవహరించడంపై తీవ్ర ఆగ్రహ జ్వాలలు వ్యక్తమవుతున్నాయి. లక్షల కుటుంబాలు ఉపాధి లేక అల్లాడుతుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేకుండా పోయింది. పిల్లలకు ఫీజులు కట్టలేక, ఇల్లు గడవక అప్పులు తెచ్చి కార్మికుల కుటుంబాలు నానా ఇబ్బందులు పడుతున్నాయి. ఇసుక సరఫరాలో ప్రభుత్వం ఆది నుంచి వివాదాస్పదంగానే వ్యవహరిస్తుండటంతో విమర్శలు వినిపిస్తున్నాయి. కొత్తగా ఉపాధి కల్పించకపోగా ఉన్న ఉపాధిని సైతం ప్రభుత్వం దెబ్బతీస్తుందనే చర్చ కార్మికుల్లో నడుస్తోంది. ప్రభుత్వం వెంటనే ఇసుక సరఫరాను వేగవంతం చేసి నిర్మాణరంగంలో పని చేసే కార్మికులను ఆదుకోవాలని అంతా కోరుతున్నారు.

మూడు నెలలుగా పస్తులే

ఎర్రా రాంబాబు, బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు

మూడు నెలలుగా ఇసుక సరఫరా లేకుండాపోయింది. దీంతో నిర్మాణ రంగంలో పని చేసే లక్షల కుటుంబాలకు పని లేకుండాపోయింది. నిర్మాణ రంగంలో దాదాపు 35 రకాల పనివారు ఉపాధి పొందుతున్నారు. పనులు లేకపోవడంతో కుటుంబాలు గడవడమే కష్టంగా మారింది. వెంటనే ఇసుక సరఫరా చేసి కార్మికులకు ఉపాధి కల్పించాలి.

ఇంటి అద్దె కట్టలేని పరిస్థితి

అయినపల్లి చినమాధవ, మదర్ థెరిస్సా రాష్ట్ర బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అసోసియేషన్ వ్యవస్థాపకులు

ఇసుక లేక నిర్మాణరంగ కార్మికులకు పని లేకుండాపోయింది. మూడు నెలలుగా పని లేకపోవడంతో ఇంటి అద్దె సైతం కట్టలేని దుస్థితి నెలకొంది. లక్షల కుటుంబాలు ఆకలితో అలమటిస్తున్నాయి. ఇసుక సరఫరా చేసి కార్మికుల ఉపాధిని కాపాడాలి.

ఓట్ల నమోదు, సవరణను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో ఓటు నమోదు, ఓటర్ల జాబితాలో మార్పు, చేర్పులకు సంబంధించి ఈ నెల 2, 3 తేదీల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రత్యేక కార్యక్రమాన్ని శని, ఆదివారాల్లో అన్ని పోలింగ్ స్టేషన్లలో సదస్సులు ఏర్పాటు చేశామన్నారు. అక్కడ బూత్ లెవెల్ అధికారులు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు. జిల్లాలో 20 మండలాలు, 6 మున్సిపాల్టీల్లో పోలింగ్ బూత్లు ఉన్నాయని ఆయా ప్రాంతాల వారిగా ఓటర్లంతా వెళ్లి తమ ఓట్లు పరిశీలించు కోవాలని కోరారు. కొత్త ఓటు నమోదుకు ఫారం-6లో, ఓటు తొలగింపు, మరణించిన లేదా ఒక వ్యక్తి రెండు ఓట్లు కలిగి ఉన్నవారికి, శాశ్వత బదిలీ అయిన వారి కోసం ఫారం-7ను తీసుకుని వివరాలు నమోదు చేసి ఇవ్వాలని పేర్కొన్నారు. ఓటరు లిస్టులోని అన్ని రకాల సవరణలతో పాటు ఓటు బదిలీ చేసుకోవడానికి ఫారం-8 పూర్తి చేయాలని తెలిపారు. రెండ్రోజుల పాటు జిల్లాలో అన్ని పోలింగ్ కేంద్రాల వద్దా జరిగే ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కలెక్టరు కోరారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకున్నామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి శుక్రవారం డ్రాఫ్ట్ పబ్లికేషన్ రోజున పెండింగ్లో ఉన్న దరఖాస్తుల స్థితి, ప్రత్యేకంగా 30 రోజులకుపైగా పెండింగ్లో ఉన్న ఫారాలు, ఎస్-ఎస్ఆర్ సమయంలో స్వీకరించిన ఫారాలు, అనోమలిస్ పెండింగ్, ముసాయిదా జాబితాపై ఓట్ల చేర్పులు, తొలగింపులు, సవరణలు, పెండింగ్లో ఉన్న రాజకీయ పార్టీల ఫిర్యాదులు, ఇరోల్పై రిపోర్ట్లు, ఎపిక్ కార్డుల జనరేషన్, పంపిణీ, పిఎస్ఇలు, డిఎస్ఇలు, నోడల్ అధికారులు, సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీసు అధికారుల నియామకం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఆర్డిఒ కె.శ్రీనివాసులురాజు, అచ్యుత్ అంబరీష్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిపేందుకు ఓటర్ల జాబితా ఎప్పటికప్పుడు అప్డేట్ చేయడంలో రూపొందించిన ప్రణాళిక ప్రకారం పనులు జరుగుతున్నాయన్నారు. ప్రతిరోజూ ఇఆర్ఒలతో రివ్యూ చేయడం జరుగుతుందన్నారు. గ్రామ సచివాలయంలో ఉన్న డేటాబేస్ ఆధారంగా వెల్ఫేర్ సెక్రటరీలు, బిఎల్ఒల సహాయంతో 18 ఏళ్ల నిండిన 8,900 మంది యువ ఓటర్లకు ఓటు హక్కు కల్పించామని, ఇంకా 2 వేల మంది ఓటర్లకు ఓటు హక్కు కల్పించే ప్రక్రియ జరుగుతుందని వివరించారు. భీమవరంలో 238 ఫిర్యాదులు పెండింగ్లో ఉన్నాయని, ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు కౌంటర్ ఫిర్యాదు చేసుకోవడం వల్ల ఇఆర్ఒ విచారణ చేయాల్సిందన్నారు. జిల్లాలో ఈ నెల 4వ తేదీకి 15 రోజుల మండేటరీ పీరియడ్ పూర్తవుతుందని, 5వ తేదీ నుంచి డిస్పోస్ చేయనున్నామని ఆమె తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ కానాల సంగీత్ మాధుర్, ఎలక్షన్ డిటి ఎం.సన్యాసిరావు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్లో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

ఎయిడ్స్పై అవగాహన కలిగి ఉండాలి

పౌర సరఫరాల శాఖా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

ప్రజాశక్తి - తణుకురూరల్

ఎయిడ్స్పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి, ఎయిడ్స్ రహిత సమాజం కోసం పాటుపడాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రి ప్రాంగణంలో ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆసుపత్రి ఇన్ఛార్జి సూపరింటెండెంట్ వెలగల అరుణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ రోగులు క్రమం తప్పకుండా మందులు వాడి వారి జీవనకాలం పెంచుకోవాలన్నారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపరాదన్నారు. తణుకు సేఫ్ కేర్ సెంటర్కు బెస్ట్ అవార్డు రావడంతో సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుంకవల్లి రామకృష్ణ, సిబ్బందిని మంత్రి కారుమూరి ఘనంగా సత్కరించారు. అనంతరం ఐఎంఎ సీనియర్ వైద్యులు తాతిన రామబ్రహ్మం ప్రతిజ్ఞన చేయించగా మంత్రి కారుమూరి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ ఛైర్మన్ చిట్టూరి వెంకట సుబ్బారావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ గౌరవాధ్యక్షులు దాట్ల సుందరరామరాజు, ఎఎంసి ఛైర్మన్ నత్తా కృష్ణవేణి, ఎంఎ అధ్యక్షులు ఎం.రఘు, కార్యదర్శి డా.రమేష్కుమార్ పాల్గొన్నారు.



తణుకురూరల్ : ర్యాలీని ప్రారంభిస్తున్న మంత్రి కారుమూరి

భీమవరం : హెచ్ఐవి సోకిన వ్యక్తులు వివక్షతకు గురికాకుండా వారు సమాజంలో ఒక భాగమని గుర్తించి వారికి ఆత్మ స్థయిర్యాన్ని ఇవ్వాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డి.మహేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక ఏరియా ప్రభుత్వాసుపత్రి నుంచి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ అనంతరం ఆసుపత్రిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హెచ్ఐవి సోకకుండా ఎన్నో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తోందని, సోకిన వారికి ఎన్నో సంక్షేమ, ఆరోగ్య కార్యక్రమాలు అందిస్తోందని తెలిపారు. ఎయిడ్స్పై ప్రతి ఒక్కరికీ పూర్తి అవగాహన ఉండాలన్నారు. గర్భిణులు తప్పకుండా హెచ్ఐవి పరీక్షలు చేయించుకోవాలన్నారు. విశిష్ట వైద్య సేవలందించిన వైద్యాధికారులు, వైద్య సిబ్బందికి, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు 30 మందికి ప్రశంసాపత్రాలు, బహుమతులను డిఎంహెచ్ఒ అందజేశారు. భీమవరం దివ్య జ్ఞాన సమాజం వారి సహకారంతో 50 మంది హెచ్ఐవి, ఎయిడ్స్ పేషెంట్లకు పోషకాహార కిట్లను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.వీరాస్వామి, ఎఆర్టి వైద్యాధికారి డాక్టర్ బి.ప్రసాద్, తణుకు బ్లడ్ బ్యాంకు అధినేత శ్రీనాథ్ పాల్గొన్నారు. అలాగే కృష్ణ యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎయిడ్స్ దినోత్సవం నిర్వహించారు. ఆసుపత్రి నుంచి సబ్ జైల్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో కృష్ణ యువజన సంక్షేమ సంఘం ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.అర్చన, పట్టణ పోలీసులు, 100 మంది కెజిఆర్ఎల్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు ర్యాలీలో పాల్గొన్నారు. 20 మంది హెచ్ఐవి బాధితులకు పౌష్టికాహార కిట్లను భీమవరం లయన్స్ క్లబ్, కియాస్ ఉద్యోగుల సహకారంతో అర్చన, లయన్స్ క్లబ్ కమిటీ మెంబర్స్ చేతుల మీదుగా అందజేశారు.

నరసాపురం:ఎయిడ్స్పై అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నరసాపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నుంచి నరసాపురం బస్టాండ్ వరకూ శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ చీఫ్విప్ ముదునూరి ప్రసాదరాజు ప్రారంభించి మాట్లాడారు. గతంలో ఈ వ్యాధి గురించి భయపడే పరిస్థితి ఉండేదన్నారు. ప్రస్తుతం శక్తివంతమైన మందులు రావడం వల్ల వ్యాధి కాలక్రమేణ తగ్గుతూ వస్తోందన్నారు. దీన్ని పూర్తిగా నిర్మూలించాలని ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాలేజీలు ఎన్ఎస్ఎస్ పిఒలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ బర్రె శ్రీ వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, ఆస్పత్రి అభివద్ధి కమిటీ సభ్యులు గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు పాల్గొన్నారు.

ట్రాఫిక్లో 108 అంబులెన్స్

ప్రజాశక్తి - ఉండి

అసలే ఇరుకు వంతెన ఆపై నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ప్రజలు చెబుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఉండి మెయిన్ సెంటర్ నాలుగు రోడ్ల కూడలి కావడం ఆపై నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శుక్రవారం సాయంత్రం 108 ట్రాఫిక్ లో ఇరుక్కుపోయింది. 108 వాహనం డ్రైవర్ ఎంత హారన్ మోగించినా చాలాసేపటి వరకూ ఉపయోగం లేకపోయింది. ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనాలు రాకపోకలకు ఇబ్బందికి గురయ్యారు. రోడ్డుకు ఆనుకొని బ్యానర్లు కట్టడం, చిరు వ్యాపారస్తులు రోడ్లపైనే వ్యాపారాలు చేయడం ద్వారా ట్రాఫిక్కు నిత్యం అంతరాయం కలుగుతుందని స్థానికులు వాపోతున్నారు. గతంలో ఉండి మెయిన్ సెంటర్లో పోలీసులు వాహన రాకపోకలను నియంత్రించే వారిని, కొద్ది నెలల నుంచి ఉండి మెయిన్ సెంటర్లో పోలీసులు ట్రాఫిక్ నియంత్రించడంలో ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అలాగే సాయంత్ర వేళలో స్కూల్ బస్సులు ఒకే సమయానికి రావడంతో ఉండి మెయిన్ సెంటర్లో ట్రాఫిక్ సమస్య ఎక్కువ అవుతోందని ఇప్పటికైనా ఉండి మెయిన్ సెంటర్లో పోలీసులను ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్యను తీర్చాలని, వంతెన నిర్మాణాన్ని చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ట్రాఫిక్లో నిలిచిన 108 వాహనం

రోడ్డు నిర్మించాలని సిపిఎం నిరసన

ప్రజాశక్తి - భీమవరం రూరల్

వెంప నుంచి వారతిప్ప ఆర్ఆర్అండ్బి రోడ్డు గోతులు పూడ్చి రోడ్డు వేయాలని సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం వెంప నుంచి వారతిప్ప ఆర్అండ్బి రోడ్డు గోతులు పూడ్చి రోడ్డు వేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ వెంప నుంచి వారతిప్ప వెళ్లే ఆర్ఎంబి రోడ్డు గోతులు పడడం వల్ల నిత్యం వందలాది మంది రైతులు, విద్యార్థులు, ప్రజలు ప్రయాణించాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వెంప నుంచి వారతిప్ప వెళ్లే ఆర్ఎంబి రోడ్డు గోతులు పూడ్చి రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గుండుబోయిన సత్యనారాయణ, దొమ్మేటి నాగరాజు, చిలకపాటి సూర్యప్రకాష్, సానబోయిన సత్యనారాయణ, పట్టెం సారవయ్య పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ఉత్సవ విగ్రహాల్లా సర్పంచులు : కడలి గోపాలరావు

ప్రజాశక్తి - ఉండి

గ్రామ పంచాయతీల్లో నిధులు లేకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయలేక సర్పంచులందరూ ఉత్సవ విగ్రహాలుగా మారిపోయారని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు కడలి గోపాలరావు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఉండి గ్రామం క్షత్రియ కళ్యాణ మండపంలో సర్పంచుల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు గుర్రంబాల వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 14, 15వ ఆర్థిక సంఘం నిధులు దోచుకోవడం వల్ల పంచాయతీ ఖాతాలో నిధులు లేకపోవడంతో అభివృద్ధి పనులు నిలిచిపోయి పరిపాలన కుంటుపడిందన్నారు. సచివాలయాలను, వాలంటీర్లను పంచాయతీలో విలీనం చేయాలన్నారు. ఈనెల 11వ తేదీన జోన్-2 పరిధిలో పంచాయతీ రాజ్ ఛాంబర్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తున్నామని సర్పంచులు, ఎంపిటిసిలు, మాజీ సర్పంచులు మాజీ ఎంపిటిసిలందరూ విజయవంతం చేయాలని కోరారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సర్పంచులకు, ఎంపిటిసిలకు గౌరవ వేతనం రూ.15 వేలు పెంచాలని, మైనర్ పంచాయతీలకు విద్యుత్ బిల్లులు రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గేదెల జాన్, ఎం.సూర్యనారాయణ, కునుకు.శ్రీను, మిద్దే.విశ్వేశ్వరరావు, వనిమా శ్రీను, బి.వీరబాబు, యువరాజు, ముదునూరి కృష్ణంరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కడలి గోపాలరావు

పెద్దసంఖ్యలో రౌడీషీట్లు ఎత్తివేత

జిల్లా ఎస్పి యు.రవిప్రకాష్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

860 మందిపై ఉన్న రౌడీ, కేడి, టుడేషీట్లను తొలగిస్తున్నట్లు జిల్లా ఎస్పి యు.రవిప్రకాష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా నేరాలకు పాల్పడుతున్న వారిపై, గత నేరస్తులపై ప్రత్యేక నిఘా పెట్టామని తెలిపారు. ఐదేళ్లుగా వారిపై ప్రత్యేక నిఘా పెట్టి సత్ప్రవర్తన కలిగిన వారిపై రౌడీషీట్లు కొట్టివేసినట్లు తెలిపారు. వీరిలో 653 సస్పెక్టెడ్ (అనుమానితులు), 35 కేడిషీట్లు, 170 రౌడీ షీట్లు ఉన్నాయని తెలిపారు. ఇక నుంచి సత్ప్రవర్తనతో నడుచుకోవాలని లేనిపక్షంలో ఎటువంటి ఆర్థిక నేరాలకు, నేర ప్రవృత్తికి పాల్పడితే అటువంటి వారిపై తిరిగి రౌడీ షీట్ ఓపెన్ చేస్తామని, చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వెలమలను గుర్తించింది వైసిపియే

ఎంపీ కోటగిరి శ్రీధర్బాబు

ప్రజాశక్తి - వీరవాసరం

రాష్ట్రంలో గతంలో ఏ పార్టీ గుర్తించని విధంగా వెలమ కులస్తులను గుర్తించి అధిక సంఖ్యలో వారికి పదవులు కట్టబెట్టింది వైసిపినే అని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్బాబు అన్నారు. వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధుల సత్కార సభ శుక్రవారం వీరవాసరంలో నిర్వహించారు. భీమవరం ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సభలో ఎంపీ మాట్లాడుతూ గతంలో వెలమలు టిడిపిలో కొనసాగేవారన్నారు. నేడు జగన్మోహన్రెడ్డి వెలమలకు గతంలో ఏ నాయకుడూ కేటాయించని విధంగా గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ అన్ని రంగాల్లో పదవులు కేటాయించి తమ కుల నాయకత్వాన్ని గుర్తించారన్నారు. గతంలో టిడిపిలో రాని గుర్తింపు వైసిపిలో వచ్చిందన్నారు. సామాజిక సాధికారత, సమ న్యాయంతో అన్ని వర్గాల ప్రతినిధులనూ గుర్తించి పదవులు కేటాయించిన పార్టీ వైసిపి అన్నారు. ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజల సహకారం ఉంటేనే అభివృద్ధి సాధ్యమన్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఛైర్మన్ పద్మశ్రీ దంపతులను సత్కరించారు. అలాగే పలు పదవుల్లో ఉన్న వెలమ కులస్తుల ప్రజాప్రతినిధులను సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచి చికిలే మంగతాయారు, ఆకివీడు మున్సిపల్ ఛైర్మన్ హైమావతి, ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు పాల్గొన్నారు.



జిల్లా పరిషత్ ఛైర్మన్ పద్మశ్రీ దంపతులను సత్కరిస్తున్న సంఘం సభ్యులు

ముఖ్యమంత్రి జగన్ హామీని నిలబెట్టుకోవాలి

అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యాణి

ప్రజాశక్తి - భీమవరం

అంగన్వాడీలకు తెలంగాణ కంటే అదనంగా వెయ్యి రూపాయలు ఇస్తానని ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కళ్యాణి డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా రూ.5 లక్షలు ఇచ్చి సమస్యలు పరిష్కరించాలన్నారు. లేని పక్షంలో ఈ నెల 8వ తేదీ నుంచి సమ్మెలోకి వెళతామని హెచ్చరించారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు కె.ఝాన్సీలక్ష్మి అధ్యక్షతన జిల్లా విస్తృత సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్యాణి మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందన్నారు. అనేకమార్లు ప్రభుత్వాలకు సమస్యలు విన్నవించినా ప్రభుత్వం పరిష్కరించలేదని, తప్పనిసరి పరిస్థితుల్లో ఈనెల 8వ తేదీ నుంచి సమ్మె చేపట్టనున్నామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 1వ తేదీ నుంచి నల్ల బ్యాడ్జీలతో విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఐసిడిఎస్కు నిధులు పెంచి నాణ్యమైన ఆహారాన్ని లబ్ధిదారులకు, పిల్లలకు అందించాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు రాష్ట్రంలో కూడా అంగన్వాడీలకు గ్రాడ్యుటీ ఇవ్వాలని, చివరి వేతనంలో 50 శాతం పెన్షన్గా ఇవ్వాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లకు మార్చాలని, హెల్పర్స్ పూర్తిస్థాయిలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎండి హసీనా బేగం, ఉషారాణి, పెనుగొండ తులసి, విజయలక్ష్మి, రాజమణి, దీనకుమారి, అనూరాధ, రజిని, పెద్దింట్లు, సావిత్రి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యాణి

మున్సిపల్ ప్రత్యేకాధికారిగా ఆర్‌డిఒ శ్రీనివాసులురాజు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం మున్సిపల్ కార్యాలయం ప్రత్యేకాధికారిగా ఆర్‌డిఒ కె.శ్రీనివాసులురాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయానికి వెళ్లిన ఆయనకు మున్సిపల్ కమిషనర్ శ్యామలాదేవి పూల బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మున్సిపల్ అధికారులతో సమస్యలపై చర్చించారు.

స్వచ్ఛమైన తాగు నీరందించడమే లక్ష్యం

ప్రజాశక్తి - ఉండి

స్వచ్ఛమైన తాగునీరందించడమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు అన్నారు. ఉండి నాలుగో సచివాలయ పరిధిలో శుక్రవారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం రూ.26 లక్షల జలజీవన్ మిషన్ నిధులతో ఉండి శివారు ఉప్పుగుంట ప్రాంతంలో మంచినీటి పైపులైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - కాళ్ల

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే వైసిపి లక్ష్యమని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు అన్నారు. మండలంలోని కలవపూడిలో వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్క లబ్ధిదారునికి సంక్షేమ పథకాలు అందిస్తామని స్పష్టం చేశారు. అర్హత ఉండి సాంకేతిక కారణాలతో పథకాలు అందకపోతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పథకాలను తెలిపే డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శిరీష విశ్వనాధరాజు, జెడ్‌పిటిసి సభ్యులు సోమేశ్వరరావు, జిల్లా ఆక్వా సలహా మండలి సభ్యులు పి.దుర్గాప్రసాదరాజు, కలవపూడి సొసైటీ అధ్యక్షుడు బర్రె గంటయ్య, ఎంపిటిసి సభ్యులు నాగరాజు, వైసిపి మండల అధ్యక్షులు గణేశ్న రాంబాబు, తోటకూర చిన్నా పాల్గొన్నారు.


సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న పివిఎల్

మహిళ చదువుకుంటేనే దేశ ప్రగతి

ప్రజాశక్తి - కాళ్ల

మహిళలు చదువుకుంటే మన దేశం ప్రగతి పథంలో ముందుకు వెళుతుందని, వారిని పురుషులతో సమానంగా చూడాలని డాక్టర్ గులాబ్ రాజ్‌కుమార్ అన్నారు. కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఆదేశాల మేరకు బేటి బచావో- బేటి పఢావో నినాదంపై శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం కాళ్ల మండల పరిషత్ కార్యాలయంలో బేటి బచావో బేటి పఢావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గులాబ్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం వంద రోజుల పాటు ప్రతి గ్రామ సచివాలయంలో నిర్వహిస్తామని వివరించారు. ఎఒ ఎంఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ మహిళల పట్ల వివక్ష చూపకూడదన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ దేవర విజయవతి, ఎంపిహెచ్ఒ విలియం హెన్రీ పాల్సన్, సూపర్‌వైజర్లు పెద్ది సుబ్బలక్ష్మి, పంతగాని పరం జ్యోతి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సూర్యకుమారి, హేమలత, అంగన్‌వాడీ టీచర్లు, యానిమేటర్లు, డ్వాక్రా మహిళలు, వైద్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

ప్రజాశక్తి - ఆచంట

బాల్య వివాహాల వల్ల అనర్థాలు వస్తాయని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సూర్యకుమార్ అన్నారు. బేటి బచావో బేటి పఢావో కార్యక్రమం వల్లూరు హైస్కూల్‌లో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ వల్లూరు సెక్టార్ సూపర్‌వైజర్ సూర్యకుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాటాడుతూ ఆడపిల్లలను పుట్టనిద్దాం, పెరగనిద్దాం, చదివిద్దాం నినాదంతో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వల్లూరు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీధరనరసింహమూర్తి, సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వినియోగదారులపై నయారా పెట్రోల్ బంక్ దోపిడీ

డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్‌విఎన్.శర్మ

ప్రజాశక్తి - ఆచంట

మండలంలోని ఆచంట వేమవరం ఆర్‌అండ్‌బి రహదారి పక్కన ఉన్న నయారా పెట్రోల్ బంక్ యాజమాన్యం వినియోగదారులపై నిలువు దోపిడీకి పాల్పడుతోందని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్‌విఎన్.శర్మ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. టివిఎస్ ఎక్స్‌ఎల్ వంటి చిన్న వాహనాలకు సర్వో 2టీ ఇంజనాయిల్ ప్యాకెట్లపై ఎంఆర్‌పి రూ.17 ఉండగా పెట్రోల్ బంక్ సిబ్బంది రూ.20 వరకూ వసూలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా తూనికలు, కొలతల శాఖాధికారులు, విజిలెన్స్ మెనిటరింగ్ అధికారులు నయారా బంక్ మోసాలపై విచారణ జరిపించి, పేద, సామాన్య ప్రజలకు, వినియోగదారులకు, వాహనదారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

పేదలకు న్యాయం చేయాలి : సిపిఐ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

కొత్త పూసలమర్రు గ్రామంలో గత 15 ఏళ్లుగా గ్రామ కంఠం భూమిని పేదవారికి విక్రయించి వారికి దారి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న గ్రామ పెత్తందారిపై చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు కోరారు. శుక్రవారం ఆ స్థలాన్ని సిపిఐ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ ఈ స్థలం విషయంలో అనేక రకాలుగా ప్రభుత్వ అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకుంటున్నప్పటికీ పేదలకు న్యాయం జరగలేదన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని పేదవారికి న్యాయం చేయాలన్నారు. లేకపోతే పేదలతో కలిసి ఆందోళన చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కలిసేటి వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాంప్రసాద్, దొమ్మేటి నాగరాజు, తిరుమాని కామేశ్వరరావు, వాటాల రాధాకృష్ణ, బస్వాని కృష్ణ, బసవని వెంకటేశ్వర్లు మోకా సావిత్రి, పి.రాంబాబు, బస్వాని ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

మొగల్తూరులో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి - మొగల్తూరు

రానున్నది టిడిపి ప్రభుత్వమేనని ఆ పార్టీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. మొగల్తూరు పంచాయతీ పరిధి ఓడయ్యార్ పేటలో ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు ఆధ్వర్యంలో శుక్రవారం భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామంలో ప్రజా వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బస్వాని ఏడుకొండలు, కత్తిమండ ముత్యాలరావు, కలిదిండి కుమార్‌బాబు, పాల రాంబాబు, గోపాలం, కొల్లాటి భోగరాజు, పొన్నపల్లి శివ పాల్గొన్నారు.

విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలోని జివిఎస్‌విఆర్ఎం మున్సిపల్ పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. స్థానిక వీవర్స్ కాలనీ యుహెచ్‌సి వారు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఝాన్సీ, పెద్దిరాజు, హెచ్ఎం భవానీప్రసాద్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో అవినీతి పాలన : పితాని

ఆచంట (పెనుమంట్ర) :రాష్ట్రంలో అవినీతి రాజ్యమేలుతోందని మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు పితాని సత్యనారాయణ అన్నారు. పెనుమంట్ర, పొలమూరు గ్రామాల్లో టిడిపి, జనసేన ఆధ్వర్యంలో శుక్రవారం రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పితాని సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రశ్నించిన వారిని అడ్డుకుంటున్న దుర్మార్గపు రాజకీయ పాలన నడుస్తుం దన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు తమనంపూడి శ్రీనివాసరెడ్డి (బుల్లాలు), కార్యదర్శి గూడూరి మురళి, గంటా వాసు, దుర్గా రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

మనసున్న మహారాజు బలరామరాజు

గ్రామాభివృద్ధిలో ఆయన కృషి అమోఘం

ప్రజాశక్తి - కాళ్ల


బలరామరాజు (ఫైల్)

సమాజంలో ధనవంతులు ఉంటారు. అందులో మనసున్న మహారాజులే అసలైన శ్రీమంతులుగా పేరొందుతారు. సొంత గ్రామం అభివృద్ధి కోసం తనకున్నంతలో భూములను దానంగా ఇవ్వడంతో పాటు గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందించిన మాజీ సర్పంచి గోకరాజు బలరామరాజు మనసున్న మారాజు.

సొంత ఊరు అభివృద్ధికి కృషి చేసి గ్రామ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారు. గ్రామ సర్పంచిగా పదవి ఏకగ్రీవంగా పలు దఫాలు వెతుక్కుంటూ వచ్చి వరించడం అరుదుగా ఉంటుంది. కాళ్ల మండలంలోని జువ్వలపాలెం గ్రామానికి చెందిన గోకరాజు కుటుంబానికి ఘనమైన చరిత్ర ఉంది. గ్రామ సర్పంచిగా అందరివాడు, అజాత శత్రువుగా వెలుగొందారు. 18 ఏళ్ల పాటు గ్రామ సర్పంచి జీవితంలో ఆయన ఆద్యంతం వివాద రహితుడిగానే మెలిగారు.

కుటుంబ నేపథ్యం

తాతల కాలం నాటి నుంచి భూస్వాముల కుటుంబం. జువ్వలపాలెంలోని ఆ కుటుంబంలో 1934లో గోకరాజు బలరామరాజు జన్మించారు. గోకరాజు రంగరాజు, బుల్లి అచ్చాయమ్మ దంపతులకు బలరామరాజు మూడో కుమారుడు. తల్లిదండ్రులు ఆర్థిక స్థితిమంతులు కావడంతో ప్రజలకు ఆర్థికంగా సాయం అందించారు.

1959లో పంచాయతీగా ఏర్పాటు

జువ్వలపాలెం ఒకప్పుడు ఏలూరుపాడు గ్రామ పంచాయతీలో ఉండేది. 1959లో జువ్వలపాలెం గ్రామపంచాయతీగా ఏర్పడింది. 1959 నుంచి 2013 వరకు 40 ఏళ్ల పాటు పంచాయతీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఆయన హయాంలో పంచాయతీ కార్యాలయం నిర్మించారు.

పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కలేదు

బలరామరాజు సర్పంచిగా ఉన్న సమయంలో గ్రామ ప్రజలు పోలీస్ స్టేషన్‌కు ఏనాడు వెళ్లిన దాఖలాలు లేవు. ఎన్నికలు వస్తే అన్ని తరగతులవారిని పిలిపించి మాట్లాడి సర్పంచి ఎన్నికలు ఏకగ్రీవంగా నిర్వహించేవారు. గ్రామస్తులు ఏకతాటిగా ఉంటూ పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నుకునేవారు. ఏలూరుపాడు నుంచి విడిపోయిన పరిస్థితుల్లో జువ్వలపాలెం మైనర్ పంచాయతీగా ఉండేది. సమీపంలో ఉన్న మేజర్ పంచాయతీలతో పోలిస్తే ఆదాయం బాగానే ఉంది. జువ్వలపాలెం మైనర్ గ్రామపంచాయతీ ఆదాయం అంతంత మాత్రమే. ప్రభుత్వం నుంచి నిధుల మంజూరుకు అనేక అవస్థలు పడాల్సి వచ్చేది. బలరామరాజు సర్పంచిగా ఉన్నప్పుడు పంచాయతీ వార్షికాదాయం రూ.ఆరు వేలు ఉండేది. సమిష్టిగా కృషి చేస్తే దాన్ని రూ.70 వేలకు చేర్చగలిగారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

జువ్వలపాలెంలో ఒకప్పుడు రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, డ్రెయినేజీ సమస్యలు ఉండేవి. జువ్వలపాలెం ముద్దుబిడ్డ గోకరాజు బలరామరాజు అదే స్ఫూర్తితో గ్రామాభివృద్ధికి బాటలు వేస్తూ పేదలకు బాసటగా నిలిచారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు బలరామరాజు కృషి అమోఘం. ఎస్‌సి పేట, గరువుపేట ప్రాంతాల్లో 26 ఎకరాల్లో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చారు. వాటిలో సుమారు 200 ఇళ్ల నిర్మించగలిగారు. పంచాయతీ కార్యాలయం, పశువుల ఆసుపత్రి భవనం, ఫుట్‌పాత్, సంత మార్కెట్, ఉప్పరగూడెం చెరువు తవ్వకం వంటి పనులు చేయించారు. గ్రామంలో ప్రతి స్థలాన్ని సేకరించి ఆదాయ వనరులుగా మార్చారు. గ్రామ ప్రజల సంక్షేమం కోసం బలరామరాజు నిరంతరం పని చేశారు. బలరామరాజు సర్పంచిగా పని చేస్తున్న కాలంలో గ్రామంలో అభివృద్ధి నిధులు లేవు. గ్రామ పంచాయతీ ఆదాయం చాలా తక్కువ. అయినా నిరుత్సాహపడకుండా కేంద్ర, రాష్ట్ర సమితి, జిల్లా పరిషత్ ప్రభుత్వాల నుంచి నిధులు మంజూరు చేసేందుకు ప్రయత్నించి గ్రామంలోని సామాన్య జనం, దళిత, బిసి తరగతులకు అన్ని రకాలుగా సహాయం అందించారు.

ఆలయ నిర్మాణం

కాళ్లకూరులో శ్రీవల్లి దేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాన్ని గోకరాజు బలరామరాజు, సరస్వతి దంపతుల ఆర్థిక సహకారంతో 1980లో నిర్మించారు.

18 ఏళ్ల పాటు గ్రామ సర్పంచిగా సేవలు

1970 నుంచి 1988 వరకు సర్పంచిగా పలు దఫాలు ఏకగ్రీవంగా పని చేశారు. గ్రామ సర్పంచిగా వరుసగా 18 ఏళ్ల పాటు తనదైన శైలిలో గ్రామ రాజకీయాలను శాసించిన బలరామరాజు గ్రామాభివృద్ధికి బాటలు వేశారు. గ్రామస్తుల ఆదరణ, కలుపుగోలుతనం, నాయకత్వ నిపుణతతో గ్రామ సర్పంచి పదవిని పలు పర్యాయాలు ఏకగ్రీవంగా దక్కించుకున్న ఘనత ఆయనదే. గ్రామంలో పేద తరగతులకు ఏ కష్టం వచ్చినా బలరామరాజు ఆపద్బాంధవుడుగా ఉండేవారు. గ్రామ పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు నిధులను తీసుకొచ్చి సర్పంచిగా 18 ఏళ్ల పాటు జువ్వలపాలెం పల్లె ప్రగతికి విశేష కృషి చేశారు.


ఎస్‌సి ప్రాంతంలో గోకరాజు బలరామరాజు కాలనీ

గోకరాజు బలరామరాజు నగర్

1981లో గోకరాజు బలరామరాజు నగర్‌ను ఏర్పాటు చేశారు. 1982లో బలరామరాజు సర్పంచి హయాంలో ఎస్‌సి పేటలో 13.70 ఎకరాల భూమిని ఇల్లు లేని పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఒక్కొక్క లబ్ధిదారునికి మూడు సెంట్ల చొప్పున ఇళ్ల పట్టాలు అందించారు. ఇళ్ల స్థలాల మట్టి పూడిక పనులు చేయించి కేటాయించారు. పూరి గుడిసెలు నిర్మించేందుకు 92 మంది లబ్ధిదారులకు గుమ్మాలు అందించారు.

శాశ్వత గృహ నిర్మాణ సముదాయం

జువ్వలపాలెంలో శాశ్వత గృహ నిర్మాణ సముదాయాన్ని 1984లో 52 బంగాళ పెంకుటిల్లులు నిర్మించారు. సర్పంచి గోకరాజు బలరామరాజు హయాంలో మొదటి బంగాళ పెంకిటిల్లు గాతల ఏలియ్య


పంటకాలువపై నిర్మించిన ఫుట్‌పాత్ వంతెన

ఇంటిని 1984లో అప్పటి జిల్లా కలెక్టర్ ఎస్.లక్ష్మీనారాయణ ప్రారంభించారు. పేదలు ఇళ్లు కట్టుకోవడానికి తన వంతు సహకారం అందించారు. గ్రామంలో ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించారు. మట్టి, గ్రావెల్, మెటల్ రోడ్లు నిర్మించారు. ఇల్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు ఇందిరమ్మ కాలనీలో మౌలిక వసతులు కల్పించారు. ఇల్లు కట్టుకున్న ప్రతి పేదవాడికి ఆర్థిక సహకారం అందించడంతో ఆ ప్రాంత ప్రజలు గోకరాజు బలరామరాజు నగర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆ కాలనీకి బలరామరాజు నగర్ పేరు పెట్టుకోవడం విశేషం. ప్రస్తుతం ఆ నగర్‌లో పెద్ద పెద్ద బిల్డింగులు నిర్మాణాలు జరిగి చూడచక్కని ప్రాంతంగా మారింది.

సిబిసిఎన్‌సి చర్చికి స్థలం విరాళం, ఆర్థిక సాయం

2012లో సిబిసిఎన్‌సి చర్చి నిర్మాణానికి 62 సెంట్ల భూమిని విరాళంగా అందించారు. గోకరాజు రంగరాజు కుమారులు గోకరాజు కృష్ణమూర్తిరాజు, గోకరాజు రామలింగరాజు, గోకరాజు బలరామరాజు వారి కుమారుడు గోకరాజు రంగరాజు (రంగబాబు), వారి కుమారుడు గోకరాజు వెంకట బలరామకృష్ణంరాజు (వంశీ) సహాయ సహకారాలు అందించారు. స్థలం ఇవ్వడంతో పాటు ఆర్థిక సాయం రూ.లక్ష అందించారు.

నేడు జువ్వలపాలెంలో సంస్మరణ సభ

జువ్వలపాలెం గ్రామంలో గోకరాజు బలరామరాజు సంస్మరణ సభ ఈ నెల రెండో తేదీ శనివారం నిర్వహిస్తున్నామని గోకరాజు వెంకట బలరామ కృష్ణంరాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు రానున్నారు. బలరామరాజు జువ్వలపాలెం గ్రామానికి 18 ఏళ్ల పాటు సర్పంచిగా విశిష్ట సేవలందించారన్నారు. ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకుని సంస్మరణ సభ నిర్వహిస్తామన్నారు. గ్రామస్తులకు, బంధువులకు, స్నేహితులకు అందరికీ భోజనాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

గ్రామాభివృద్ధికి బలరామరాజు సేవలు మరువలేనివి

కాళ్ల :మండలంలోని జువ్వలపాలెం సర్పంచిగా గోకరాజు బలరామరాజు గ్రామాభివృద్ధికి విశిష్టమైన సేవలందించారని పలువురు కొనియాడారు. జువ్వలపాలెంలో గోకరాజు బలరామరాజు చిత్రపటానికి శుక్రవారం పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గోకరాజు బలరామరాజుతో ఉన్న అనుబంధాన్ని మాజీ సర్పంచులు గోకరాజు సత్యనారాయణరాజు, మంతెన రామకృష్ణంరాజు గుర్తు చేసుకున్నారు. మంతెన రామకృష్ణంరాజు మాట్లాడుతూ బలరామరాజు అత్యంత ఆత్మీయులన్నారు. గ్రామాభివృద్ధికి ఆయన చేసిన సేవలు ఎనలేనివన్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి మాజీ ఛైర్మన్ కనుమూరి బాపిరాజు, పార్లమెంట్ మాజీ సభ్యులు గోకరాజు రంగరాజు, గోకరాజు రామరాజు, మాజీ సర్పంచి గోకరాజు పెద్దబాబు, మాజీ ఉప సర్పంచి గోకరాజు వినోద రంగరాజు, గోకరాజు వెంకట బలరామకృష్ణంరాజు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ

ప్రజాశక్తి - పోడూరు

2022-23 సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ చట్టం 16వ విడత సామాజిక తనిఖీ మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్‌టివి.రాజేశ్వరరావు ఆధ్వర్యంలో ఎంపిపి సబ్బితి సుమంగళి అధ్యక్షతన సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టంలో భాగంగా వెనుకబడిన తరగతుల వారికి పని దినాలు కల్పిస్తూ వారికి సకాలంలో డబ్బులు అందించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి ఎవి.విజయలక్ష్మి, డిఆర్‌డిఎ డిబి ఎం మురళీకృష్ణ, ఎంపిడిఒ డి.సుహాసిని, ఇఒపిఆర్‌డి బలరామరాజు, ఎస్‌ఆర్‌పి సోషల్ ఆడిట్ మన్మధరావు, ఎ.సాగర్ పాల్గొన్నారు.

పలుచోట్ల 'వై ఎపి నీడ్స్ జగన్'

ప్రజాశక్తి - ఆచంట

మండలంలోని వల్లూరు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచి నేలపూడి బేబీ రామ్మోహన్‌రావు అధ్యక్షతన వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ నరసింహప్రసాద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య, ఎంపిపి దిగమర్తి సూర్య కుమారి, సొసైటీ ఛైర్‌పర్సన్, వీర వెంకటసత్యనారాయణ, ఉప సర్పంచి గెద్దాడ శ్రీనివాసరావు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

పోడూరు : వద్దిపర్రు సచివాలయం వద్ద గ్రామ సర్పంచి వడ్లపాటి రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి మండల కన్వీనర్ పితాని చిన్న మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఎం.బలరామరాజు, గ్రామ కమిటీ అధ్యక్షుడు వడ్లపాటి ఆనందరాజు, ఎఎంసి డైరెక్టర్ వడ్లపాటి సురేష్, మామిడిశెట్టి భద్రయ్య పాల్గొన్నారు.

ఆచంట (పెనుమంట్ర) : నెలమూరు పంచాయతీ కార్యాలయం వద్ద వైసిపి గ్రామ అధ్యక్షుడు కుచ్చర్లపాటి వెంకట పతిరాజు అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి కుచ్చర్లపాటి మంగతాయారు మాట్లాడారు.

గణపవరం : మండలంలోని పిప్పరలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఎల్‌ఎ పుప్పాల శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. ఎంపిపి దండు వెంకటరామరాజు, ఎంపిడిఒ జి.జ్యోతిర్మయి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఉండి : మండల పరిధిలోని పాందువ్వలో గ్రామ అధ్యక్షులు అల్లూరి వెంకట రామరాజు(రాంబాబు) ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపిపి ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జెడ్‌పిటిసి సభ్యులు రణస్తుల కనకదుర్గ మహంకాళి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

పాలకొల్లు : పట్టణంలోని 4, 5, 6 వార్డుల్లో నిర్వహించిన కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు చందక సత్తిబాబు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెద్దపాటి పెద్దిరాజు, జెసిఎస్ కన్వీనర్ మోర్త గిరీష్, జిల్లా కార్యదర్శి కొండేటి రవి పాల్గొన్నారు.

మొగల్తూరు : మండలంలోని పాతపాడు గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు వాతాడి ఉమా, అల్లూరి రంగరాజు, కనుమూరు ఆంజనేయరాజు, పడవల సత్యనారాయణ, కొల్లాటి రాంప్రసాద్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సిబ్బంది అంకితభావంతో పనిచేయాలి

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

పారిశుద్ధ్య సిబ్బంది అంకితభావంతో పని చేయాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ వెంకటరమణజయరాజు అన్నారు. పారిశుధ్య సిబ్బందితో శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ మాట్లాడారు. తడి, పొడి చెత్త, ప్రమాదకర చెత్త వేర్వేరుగా సేకరించే అంశంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని చెప్పారు. ఈ సమావేశంలో ఎనిమిదో వారు కౌన్సిలర్ జయరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు, రేపు స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు నియోజకవర్గంలోని ఓటర్లు తమ ఓటు నమోదు, ఓటర్ల లిస్టులో మార్పు చేర్పులకు సంబంధించి ఈ నెల 2, 3 తేదీల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు పాలకొల్లు ఎలెక్టోరల్ రిటర్నింగ్ ఆఫీసర్ కెసిహెచ్.అప్పారావు తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా ఎన్నికల అధికారి నేతృత్వంలోని, ఆదివారాల్లో అన్ని పోలింగ్ స్టేషన్లలో సదస్సులు ఏర్పాటు చేశామని తెలిపారు.

'ఆడుదాం ఆంధ్రా'పై అవగాహన

ఆకివీడు :రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై ఆకివీడులో శుక్రవారం అవగాహన కల్పించారు. ఇప్పటివరకు గ్రామంలో 25 మంది ఈ క్రీడల కోసం నమోదు అయ్యారని సచివాలయ సిబ్బంది తెలిపారు.

'నా భార్య మృతదేహాన్ని ఇండియాకు రప్పించరూ..!'

ప్రజాశక్తి - ఉండి

ఉండి గ్రామం పెదపేటకు చెందిన అద్దంకి ఝాన్సీ జీవనోపాధి నిమిత్తం గత మే నెలలో ఖతర్ దేశం వెళ్లారు. నవంబర్ 25వ తేదీన తన కుమారునికి ఫోను ద్వారా అద్దంకి ఝాన్సీ చనిపోయిందని వార్త తెలియడంతో కుటుంబ సభ్యుల్లో విషాద ఛాయలు అలముకున్నాయి. తన భార్య మృతదేహాన్ని భారత్‌కు రప్పించి తమకు అప్పగించాలని ఆమె భర్త పేతురు కోరుతున్నాడు. తన భార్య మృతదేహాన్ని త్వరితగతిన ఇండియాకు తీసుకురావాలని రాజకీయ నాయకులను, అధికారులను వేడుకుంటున్నాడు.

ఎయిడ్స్ నివారణపై అవగాహనా ర్యాలీ


గణపవరంలో అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - గణపవరం

ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం గణపవరంలో కమ్యూనిటీ పారా మెడికల్ ప్రైమరీ హెల్త్ కేర్ యూనిట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పారా మెడికల్ ప్రైమరీ హెల్త్ కేర్ జిల్లా అధ్యక్షులు ఎఆర్‌కె.పరమేశ్వరులు మాట్లాడుతూ ప్రజలకు ఎయిడ్స్‌పై అవగాహన పెంచడం కోసం గ్రామంలో ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వ్యాధితో మరణించినవారి కుటుంబాల వారికి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనిట్ మండల అధ్యక్షులు కె.సత్యనారాయణమూర్తి, కార్యదర్శి వి.శివశ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు ప్రభాకర్, కోశాధికారి కె.అప్పారావు, పిహెచ్‌సి డాక్టర్ పి.సంతోషనాయుడు, సిహెచ్ఒ జాలాది విల్సన్‌బాబు, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

పాలకొల్లు : పాలకొల్లు ఎస్ఎన్ఎం ప్రభుత్వ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగాలు, రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ వి.యామిని అధ్యక్షతన ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. దత్తత గ్రామాలైన యాళ్లవానిగరువు, అడవిపాలెంలో కూడా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్రజలకు ఎయిడ్స్‌పై ర్యాలీ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో యాళ్లవానిగరువు, అడవిపాలెం సచివాలయాల సెక్రటరీలు, విఆర్ఒలు, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఎం.రామకృష్ణ, డాక్టర్ వి.విజయలక్ష్మి, రెడ్ రిబ్బన్ క్లబ్ కన్వీనర్ పి.జ్యోష్నశ్రీ, ఎన్ఎస్ఎస్ మెంబెర్స్ డి.మన్మధరావు, సిహెచ్.రవికుమార్, కె.పార్థసారథి, ఫిజికల్ డైరెక్టర్ జి.మహేష్ పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.నవ్యజీవన్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పిహెచ్ఎన్ ఎలిజిబెత్, ఫార్మసిస్ట్ పివి.స్వామి, సూపర్‌వైజర్లు జి.ఉదయచందర్, ఎస్‌కె.అమలేశ్వరరావు, డి.కమల, కె.సతీష్, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

ఆకివీడు : స్థానిక సర్ ఆర్థర్ కాటన్ వృద్ధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విశ్వ గీతి ట్రైప్, ఫొటో స్టాట్ సంస్థ అధినేత డివిడి.కృష్ణారెడ్డి ఆర్థిక సహకారంతో ఎయిడ్స్ రోగులకు దుప్పట్లు, భోజనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు వృద్ధుల సంఘం అధ్యక్షులు బొబ్బిలి బంగారయ్య అధ్యక్షత వహించారు. సిఐ కెవివి.సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచి చలంకూరు చలపతిరావు, బొబ్బిలి బంగారయ్య పాల్గొన్నారు. స్థానిక లయన్స్ క్లబ్ ఆఫ్ ఆకివీడు ఆదర్శ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, పౌష్టికాహారం పంపిణీ చేశారు.

తణుకు రూరల్ : తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రిలోని ఎఆర్‌టి సెంటర్‌లో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తణుకు ఒకటో అదనపు జిల్లా జడ్జి పివిఎన్.రంజిత్‌కుమార్, ఆసుపత్రి ఇన్‌ఛార్జి సూపరింటిండెంట్ వి.అరుణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎఆర్‌టి సెంటర్ వైద్యాధికారి సుంకవల్లి రామకృష్ణ, ఎంఎల్ఎస్‌సి మెంబర్ ఎం.సుబ్బయ్య, సీనియర్ న్యాయవాదులు కౌరు వెంకటేశ్వర్లు, కామన మునిస్వామి పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : నరసాపురం ప్రభుత్వాసుపత్రిలో సీతారాంపురం స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్, ఇతర ప్రభుత్వ, ప్రయివేట్ కళాశాలల విద్యార్థులకు అవగా హన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి నుంచి నరసాపురం బస్టాండ్ వరకు ర్యాలీ చేశారు. ఎంఎల్‌ఎ ముదునూరి ప్రసాద రాజు, ఎస్ఐ బిఎస్‌డిఆర్. ప్రసాద్, స్వర్ణాంధ్ర కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సురేష్ కుమార్, ఎన్ఎస్-ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ వి.మాణిక్యాలరావు, ఎంవి.కృ ష్ణమోహన్, స్వర్ణాంధ్ర కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, నర్సాపురం మండలం, వేములదీవి పడమర గ్రామ కాపురస్తురాలు డోర్ నెం. 2-6 కు చెందిన గాతల ప్రమీల అను నాయొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. ది. 05-11-2023వ తేదీన నర్సాపురం నుండి ఇంటికి వెళ్ళుతుండగా మార్గమధ్యలో పాస్‌పోర్టు ఉన్న కవరు పడిపోయినది. పాస్‌పోర్టు నెంబర్ **M4177435.** తిరిగి నా ఇంటికి వెళ్ళి చూసుకొనగా పాస్‌పోర్టు ఉన్న కవరు లేదు. కావున దొరికినవారు ఈక్రింది నెంబర్‌కు తెలియజేయగలరు.

గాతల ప్రమీల
వేములదీవి, పడమర గ్రామం
నర్సాపురం, పశ్చిమగోదావరి జిల్లా
సెల్: 7207234732

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, కాళ్ళ మండలం, బొండాడ గ్రామం, హరిచంద్రపేట, డోర్ నెం. 2-46 కు చెందిన కామాడి పద్మ, D/o. సత్యనారాయణ అను నాయొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. ది. 10-10-2023వ తేదీన నా స్వగ్రామం నుండి భీమవరం వెళ్లుతుండగా మార్గ మధ్యలో పాస్‌పోర్టు ఉన్న కవరు పడిపోయినది. పాస్‌పోర్టు నెంబర్ **N7488335.** భీమవరం వెళ్ళిన తరువాత పాస్‌పోర్టు ఉన్న కవరు లేదు. దొరికినవారు ఈక్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

కామాడి పద్మ
D/o. సత్యనారాయణ
డోర్ నెం. 2-46, బొండాడ
కాళ్ళ మండలం, పశ్చిమగోదావరి జిల్లా
పిన్: 534206, సెల్: 9030166387

MUNICIPAL CORPORATION, ELURU

e-PROCUREMENT TENDER NOTICE No: 266-268/General/2023-24, Dated: 30-11-2023

The Commissioner, Municipal Corporation, Eluru invites tenders from interested, eligible bidders for **"Providing 3 numbers of New Bore Wells at various places in Municipal Corporation, Eluru"** Total No. of works is **3** with an amount of Rs. **25.64** Lakhs.

Tender schedules are available on e-procurement market place from 02-12-2023. Last date of receipt of tenders is 07-12-2023. Further details can be seen at e-procurement market place at **www.apeprocurement.gov.in** or contact Commissioner, Municipal Corporation, Eluru, Eluru District (Phone/ Fax: 08812-245990).

Sd/- **COMMISSIONER**
MUNICIPAL CORPORATION, ELURU

IN THE HONOURABLE COURT OF ADDL. SENIOR CIVIL JUDGE'S COURT, SRIKAKULAM. O.S.16/2023

Between:
Nalla Mohanarao ...Plaintiff.
And:
Sambangi Satyanarayana --Defendant.

To,
Sambangi Satyanarayana, s/o Appalanaidu, aged 52 years, Hindu, Teacher, Door No.37-5, Opp. Gromor (P) Ltd., Ramanapeta, Attili village and Post and Mandal, West Godavari District

Please Take notice that the above matter stands posted on 18/12/2023 for your appearance before the court, therefore you are hereby directed to appear before the Honorable court on **18/12/2023 at 10.30 A.M.** either in person or through an Advocate, failing which the matter will be decided in your absence.

M. ANNAMNAIDU
Advocate,
Srikakulam, Cell:9441619887.

మమారాజశ్రీ తాడేపల్లిగూడెం 2వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P. 24/2022 in **O.S. 312/2021**

Between:
Decree Holder:
Annamreddi Subbarao
Judgement Debtor: Boddu Nethiyya

పై నంబరు డిక్రీ బాకీకి గాను ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి వేలం నిమిత్తం ది. 26-12-2023 కి వాయిదా వేసియున్నారు. కావున కావలసినవారు **ది. 26-12-2023 న ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టుకు వచ్చి పాట షరతులు తెలుసుకొని పాడుకొనవచ్చును.

SCHEDULE

West Godavari District, Tadepalligudem Sub Registrar, Tadepalligudem Mandalam, Pullayigudem Grama Panchayati, area H/o. Apparaopeta, Pullayigudem Village, R.S. No. 511 Near by Door No. 2-63 to an extent of 145 sq.yards of site and RCC roof building therein within the following boundaries.

EAST: Pedamurthi Venkateswara Rao building. **SOUTH:** Dirsipo Polayya Building. **WEST:** Main Road. **NORTH:** Panchayati cement Road.

Within the above boundaries an extent of 145 sq.yards of site and RCC roof building with all easement rights.

D.Hr. Value: Rs. 4,00,000/-
Amin Value: Rs. 10,00,000/-

There are no encumbrance on the schedule property as per E.C.

KUSULURI SIVA RAMA KRISHNA
Advocate for D.Hr
Tadepalligudem Tadepalligudem-534101
Date: 30-11-2023 Cell: 9949076266